సాక్షి కర్నూలు

శనివారం । 17 । ఫిబ్రవరి । 2024



ఎయిర్‌పోర్టుకు రూ.11.01 కోట్లు

నంద్యాల (సెంట్రల్): ఓర్వకల్లు ఎయిర్‌పోర్టుకు ప్రభుత్వం రూ.11.01 కోట్ల నిధులు మంజూరు చేసింది. వీటిని 2023 మే 1 నుంచి 2025 నవంబర్ 31 వరకు వినియోగించుకోవచ్చు.



వీనుల విందుగా ..

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలోని నిత్యకళావేదికపై శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన శృతిలయ మ్యూజిక్ అకాడమీ, కర్ణాటక మ్యూజిక్ వారి గాత్రకచేరి భక్తులను అలరించింది.



భ్రామరీకి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబాదేవికి దేవస్థాన అర్చకులు శుక్రవారం సాయంత్రం శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. శ్రీశైల గ్రామ దేవత అంకాళమ్మకు విశేష పూజలు చేశారు.

న్యూస్‌రీల్

జెడ్పీ సర్వసభ్య సమావేశం 21కి వాయిదా

కర్నూలు(అర్బన్): జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం అనివార్య కారణాలతో ఈ నెల 21వ తేదీకి వాయిదా వేసినట్లు జెడ్పీ సీఈఓ జి.నాసర రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన ఉదయం 10.30 గంటల కు జెడ్పీ సమావేశ భవనంలో ప్రారంభమవు తుందన్నారు. సమావేశంలో గ్రామీణ నీటి సరఫరా-పారిశుద్ధ్యం ,జిల్లా గ్రామీణాభివృద్ధి, జెడ్పీ, మండల పరిషత్‌లకు సంబంధించిన 2024-25 ఆర్థిక సంవత్సరం వార్షిక బడ్జెట్, 2003-24 ఆర్థిక సంవత్సరానికి సంబధించిన సవరణ బడ్జెట్‌పై సమీక్షిస్తామన్నారు. చైర్మన్ అనుమతితో ఇతర అంశాలను కూడా సమీక్షించే అవకాశం ఉందన్నారు. జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి గుమ్మనూరు జయరాం, ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, కలెక్టర్లు, వివిధ ప్రభుత్వ కార్పొరేషన్ల చైర్మన్లు, జెడ్పీటీసీ, ఎంపీపీలకు సమావేశం విషయమై సమాచారం అందించామన్నారు.

సెకండ్ స్పెల్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం

కర్నూలు సిటీ: సెకండ్ స్పెల్ ఇంటర్మీడియట్ జనరల్ ప్రాక్టికల్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మొదటి స్పెల్‌లో 77 కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. ఈ నెల 20వ తేదీ వరకు రెండో స్పెల్ పరీక్షలు నిర్వహించనున్నారు. మొదటి రోజు 38 కేంద్రాల్లో ఉదయం 1,822 మందికిగాను 1785 మంది, మధ్యాహ్నం 1.587 మందికిగాను 1,569 మంది హాజరయ్యారు.

రుణాల రికవరీకి ప్రత్యేక బృందాలు

- జిల్లా సహకార కేంద్రబ్యాంకు సీఈఓ శివలీల

కర్నూలు(అగ్రికల్చర్): రుణాల రికవరీకి సీనియర్ అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు డీసీసీబీ ముఖ్య కార్యనిర్వహణాధికారి శివలీల తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. పాత బకాయిలు దాదాపు రూ.200 కోట్లు ఉండగా, ఇందులో రూ.20 కోట్లు రెన్యువల్ అయిందని, మిగిలిన రూ.180 కోట్లు వసూలు చేయాల్సి ఉందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో పంట రుణాలు రూ.756 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా.. ఇప్పటికే రూ.356 కోట్లు వచ్చిందని తెలిపారు. రైతు నేస్తం కింద పంపిణీ చేసిన రుణాల్లో రూ.885 కోట్లు రికవరీ కావాల్సి ఉండగా... ఇప్పటి వరకు రూ.200 కోట్లు రికవరీ అయినట్లు వివరించారు. రాజన్న చేయూత కింద రూ.100 కోట్లు రావాల్సి ఉండగా.. ఇప్పటి వరకు రూ.15 కోట్లు రికవరీ అయిందని పేర్కొన్నారు.కర్షకజ్యోతి కింద రూ.576 కోట్లు రికవరీ కావాల్సి ఉందని, ఇప్పటి వరకు రూ.150 కోట్లు వచ్చిందని తెలిపారు. మార్చి నెల చివరిలోపు 80 శాతం రికవరీ చేయాలనే లక్ష్యంతో ఉన్నామని పేర్కొన్నారు. జూన్ చివరినాటికి 100 శాతం రికవరీ చేస్తామని తెలిపారు. గడువులోపు రికవరీ చేయాలని, లేకపోతే వడ్డీపై వడ్డీ, అపరాధ వడ్డీ పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.

క్వింటా వాము రూ.26,900

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో వాము ధర ఆశాజనకంగా ఉంది. కర్నూలు మార్కెట్‌కు శుక్రవారం 1,443 క్వింటాళ్లు విక్రయానికి రాగా.. కనిష్ట ధర రూ.1000, గరిష్ట ధర రూ.26,900 లభించడం విశేషం. సగటు ధర రూ.18,699 నమోదైంది. సగటు ధరను పరిశీలిస్తే అత్యధిక మంది రైతులకు గిట్టుబాటు ధర లభిస్తున్నట్లు స్పష్టమవుతోంది. కందుల ధర కాస్త తగ్గుముఖం పట్టింది. మార్కెట్‌కు కందులు 566 క్వింటాళ్లు రాగా.. కనిష్ట ధర రూ.1,009, గరిష్ట ధర రూ.9,842.. సగటు ధర రూ.9,749 లభించింది. కొర్రలకు కూడా గిట్టుబాటు ధర లభిస్తుండటం విశేషం. మార్కెట్‌కు కొర్రలు 228 క్వింటాళ్లు రాగా.. కనిష్ట ధర రూ.4,901, గరిష్ట ధర రూ.5,389, సగటు ధర రూ.5,382 లభించడం విశేషం.

19న ఎల్లెల్సీకి నీటి విడుదల



హొళగుంద: తాగునీటి అవసరాల నిమిత్తం తుంగభద్ర డ్యాం నుంచి దిగువ కాలువ(ఎల్లెల్సీ)కు ఈ నెల 19న నీరు విడుదల చేయనున్నారు. రోజూ 500 క్యూసెక్కుల చొప్పున మార్చి 10 వరకు నీటి విడుదల కొనసాగనుంది. జలాశయంలో నీరు అడుగంటడంతో బోర్డు అధికారులు గతేడాది డిసెంబర్ 25న దిగువ కాలువకు నీటి సరఫరా నిలిపి వేసిన సంగతి తెలిసిందే. తాగునీటి అవసరాల నిమిత్తం జిల్లా రైతు సంఘం నాయకులు ఒత్తిడి తీసుకురావడంతో నీటి విడుదలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. టీబీ డ్యాం పూర్తి సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 9.335 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

ఐదేళ్లు.. ఆనందాల 'సాగు'

- రైతు సంక్షేమానికి పెద్దపీట వేసిన సీఎం వైఎస్ జగన్
- వైఎస్సార్ రైతు భరోసాతో తొలగిన పెట్టుబడి కష్టాలు
- ఐదేళ్లలో రైతుల బ్యాంకు ఖాతాలకు నేరుగా రూ.1,793 కోట్లు విడుదల
- జిల్లాలో 2,96,739 మంది రైతులకు అందిన సాయం
- ప్రభుత్వ ప్రోత్సాహంతో వ్యవసాయంపై పెరిగిన ఆసక్తి
- ఇతోధికంగా పంట రుణాలు పంపిణీ చేసిన బ్యాంకులు

సీజన్‌కు ముందే పెట్టుబడి సాయం.. సబ్సిడీపై విత్తనాలు.. సాగుకు అవసరమైన యంత్ర పరికరాలు.. పంట నష్టపోతే వెంటనే పరిహారం.. ప్రతి పంటకూ మద్దతు ధర.. ఇలా రైతులకు అన్ని విధాలుగా రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. అన్నదాతల అభ్యున్నతికి పెద్దపీట వేస్తోంది. ఉన్న ఊర్లోనే వ్యవసాయానికి సంబంధించిన అన్ని రకాల సేవలు అందించేందుకు రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. టీడీపీ హయాంలో వరుసగా ఐదేళ్లు కరువు నెలకొంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ చర్యలతో రైతులు ఆనందంగా పంటలు సాగు చేస్తున్నారు.



పత్తి పొలంలో అంతరసేద్యం చేస్తున్న రైతులు (ఫైల్)

సంవత్సరం	లబ్ధిపొందిన రైతులు	అందిన పెట్టుబడిసాయం (రూ.కోట్లలో)
2019-20	2,59,12	349.81
2020-21	2,70,974	365.31
2021-22	2,66,820	360.20
2022-23	2,78,847	376.44
2023-24	2,96,739	341.24
మొత్తం		1,793

కర్నూలు(అగ్రికల్చర్): రైతు బాగుంటేనే రాజ్యం బాగుంటుందని నమ్మి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నదాతల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారు. రైతు భరోసా కింద నాలుగేళ్లపాటు ఏడాదికి 12,500 చొప్పున ఇస్తామని మేనిఫెస్టోలో ప్రకటించి.. చెప్పిన దానికంటే మిన్నగా ఐదేళ్లపాటు ఏడాదికి 13,500 చొప్పున ఇచ్చారు. వరుసగా రెండేళ్ల కరోనా రక్కసితో ఆర్థిక పరిస్థితి సహకరించకున్నా.. ఎలాంటి కోతలు లేకుండా సీజన్‌కు ముందే రైతు భరోసా పథకాన్ని అమలు చేశారు.జిల్లాలో ఈ పథకం కింద ఐదేళ్లలో 2,96,739 మంది రైతులకు రూ.1793.52 కోట్ల ఆర్థిక ప్రయోజనం లభించింది. దీంతో పెట్టుబడి సమస్యలు తొలగి రైతులు ఉత్సాహంగా సాగు చేపట్టారు. పెద్ద మనసుతో సీసీఆర్‌సీ కార్డులు పొందిన కౌలు రైతులు, ఆర్‌వోఎఫ్‌ఆర్ రైతుల(అటవీ భూములుఅనుభవిస్తున్నవారు), దేవదాయ భూములు అనుభవిస్తున్న వారికి కూడా రాష్ట్ర ప్రభుత్వం వైఎస్ఆర్ రైతుభరోసా పథకాన్ని అమలు చేసింది.

అన్నదాతలకు అండగా ఆర్బీకేలు

గతంలో రైతులు ప్రతి అవసరానికి మండల కేంద్రానికి, నియోజకవర్గం కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. అన్నదాతల కష్టాలు తొలగిస్తూ గ్రామీణ ప్రాంతాల్లో రైతుభరోసా కేంద్రాల ఏర్పాటు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాల్లో అన్ని రకాల సేవలు లభిస్తున్నాయి. వీటిలో ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు నిర్దిష్టమైన ధరలకే లభ్యమవుతున్నాయి. సాగుకు అవసరమైన యంత్రాలు కూడా అద్దె ప్రాతిపదికన ఇస్తున్నారు. పంట నష్టం ఎన్యూమరేషన్ ఆర్బీకేల ద్వారానే జరుగుతోంది. రైతులు పండించిన పంటలకు మార్కెట్‌లో ధరలు లేనప్పుడు రైతు భరోసా కేంద్రాల వారీగా మద్దతు ధరతో రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తోంది. రైతులకు ఉచిత పంటల బీమా సదుపాయం కల్పించడం పెద్ద ఊరటనిస్తోంది. నోటిపై చేసిన పంటలు ఈ-క్రాప్‌లో నమోదైతే చాలు వైఎస్సార్ ఉచిత పంటల బీమా వచ్చినట్లే.

చంద్రబాబు హయాంలో..

రుణమాఫీ హామీని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు తుంగలోకి తొక్కారు. రైతు సంక్షేమానికి ఒక్కటంటే ఒక్క పథకాన్ని కూడా సక్రమంగా అమలు చేయలేకపోయారు. టీడీపీ హయాంలో జిల్లాలో ఐదేళ్లు కరువుతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పంట కాలువలకు నీరు రాకపోవడంతో క్రాప్ హాలిడేలు ప్రకటించారు. సీజన్‌కు ముందు పంట పెట్టుబడికి డబ్బులు దొరికేవి కాదు. ప్రైవేట్ వ్యక్తుల వద్ద భారీ వడ్డీతో అప్పు తీసుకోవాల్సి వచ్చేది. అప్పుల బాధ తాళలేక టీడీపీ హయాంలో 321 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. అప్పట్లో లక్ష్యాలకు అనుగుణంగా బ్యాంకులు రైతులకు పంట రుణాలు పంపిణీ చేయలేదు. పంటలకు ప్రీమియం చెల్లించినా బీమా పరిహారం అందేది కాదు. చంద్రబాబు హయాంలో రైతుల సంక్షేమం మాటల్లో తప్ప చేతల్లో లేకపోవడం గమనార్హం.

వైఎస్సార్‌సీపీ పాలనలో..

2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు కావడంతోనే రైతుల కష్టాలకు కూడా ముగింపు పలికినట్లు అయింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయాన్ని పండుగ చేసే విధంగా వివిధ పథకాలు అమలు చేశారు. 2023-24 ఒక్క ఏడాది మినహా ప్రతి ఏటా పుష్కలంగా వర్షాలు కురిశాయి. ప్రభుత్వం నుంచి అన్ని విధాలా ఆర్థిక తోడ్పాటు అందింది. దీంతో చంద్రబాబు హయాంలో కాడి వదిలేసిన రైతులు మళ్లీ సాగు బాట పట్టారు. టీడీపీ హయాంతో పోలిస్తే దాదాపు 20 శాతం మంది రైతులు అదనంగా సాగులోకి వచ్చారు. విదేశాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడిన వారు సైతం పుట్టిన గడ్డకు వచ్చి వివిధ పంటలు సాగు చేస్తున్నారు.

అన్నదాతలకు ఉపయోగం



వైఎస్సార్ రైతు భరోసా పథకాన్ని ప్రభుత్వం విజయవంతంగా ఐదేళ్లు అమలు చేయడం రైతులకు బాగా కలిసి వచ్చింది. ఐదేళ్లలో అన్నదాతల బ్యాంకు ఖాతాల కు నేరుగా రూ.1,793 కోట్లు విడుదలైంది. ఏటా వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్న సమయంలో రైతులకు పెట్టుబడి సమస్యలు ఉంటాయి. పెట్టుబడి సమస్యలను తీర్చేందుకే ప్రభుత్వం వైఎస్ఆర్ రైతుభరోసా అమలు చేసింది. వైఎస్సార్ రైతుభరోసా, ఉచిత పంటల బీమా అన్నదాతలకు ఎంతో ఉపయోగపడ్డాయి.

– పీఎల్ వరలక్ష్మి, జిల్లా వ్యవసాయాధికారి, కర్నూలు

పంటలు బాగా పండాయి



మాకు 6 ఎకరాల పొలం ఉంది. కంది, సజ్జ, వేరుశనగ, టమాట, ఆముదం పంటలు సాగు చేస్తున్నాం. గతంలో వ్యవసాయసీజన్ మొదలవుతుందంటే పెట్టుబడి సమస్యలు ఉక్కిరిబిక్కిరి చేసేవి. బ్యాంకులు కూడా పంట రుణాలు ఇవ్వడంలో నిర్లక్ష్యం వహించేవి. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు అయిన మొదటి ఏడాది నుంచే వైఎస్ఆర్ రైతు భరోసా కింద రైతుల బ్యాంకు ఖాతాలకు నేరుగా పెట్టుబడిసాయం విడుదలవుతోంది. ఐదేళ్లు మాకు పెట్టుబడిసాయం అందింది. ఈ ప్రభుత్వంలో వర్షాలు కూడా సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాయి.

– చాణుక్య, రామకొండ, తుగ్గలి మండల

రైతుల ముంగిటకే అన్ని సేవలు



గతంలో సీజన్ వస్తుందంటే భయం వేసేది. ఒకవైపు పెట్టుబడి సమస్యలు, మరోవైపు ఎరువులు, విత్తనాల కోసం తిప్పలు.. వ్యవసాయం భారంగా ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక.. రైతుల సమస్యలు చాలా వరకు పరిష్కారం అయ్యాయి. మాకు 5.85 ఎకరాల భూమి ఉంది. ప్రధానంగా మిరప, ఉల్లి, శనగ, వేరుశనగ తదితర పంటలు సాగు చేస్తాం. మాకు ఐదేళ్లపాటు ప్రతి ఏటా రూ.13,500 ప్రకారం పెట్టుబడి సాయం అందింది. బ్యాంకులు కూడా పంట రుణాలు ఇచ్చాయి. గ్రామంలోనే రైతుభరోసా కేంద్రం ఏర్పాటుతో అన్ని సేవలు రైతుల ముంగిటకే వచ్చాయి.

– నాగరాముడు, రామళ్లకోట, వెల్దుర్తి మండలం

శ్రీమఠం.. రథయాత్రల శోభితం



మూల రాములకు హారతులు పడుతున్న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు



శ్రీమఠం ప్రాకార వీధుల్లో పంచ రథాలపై ఊరేగుతున్న మూర్తులు

మంత్రాలయం: రథసప్తమిని పురస్కరించుకుని శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో శుక్రవారం రథయాత్రలు కనుల పండువగా నిర్వహించారు. ముందుగా రాఘవేంద్రుల మూల బృందావనానికి శాస్త్రోక్తంగా నిర్మల్యా విసర్జన, పుష్ప అర్చన, పంచామృతాభిషేకాలు జరిపారు. అనంతరం పంచ రథాలపై కొలువుదీరిన దేవతామూర్తులకు శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు హారతులు పట్టారు. రజత గజ వాహనంపై ప్రహ్లాదరాయలు, చెక్క రథంపై ఆంజనేయస్వామి, వెండి రథంపై మధ్వాచార్యులు, బంగారు వాహనంపై సత్యనారాయణస్వామి, నవరత్నాల రథంపై మూల, జయ, దిగ్విజయరాములను ఊరేగించారు. శ్రీమఠం ప్రాకార వీధుల్లో ఏకకాలంలో అశేష భక్తజనం మధ్య రథయాత్రలు శోభాయమానంగా జరిగాయి. మంగళవాయిద్యాలు, వేద విద్యార్థుల వేదపారాయణం, హరిదాస కీర్తన భజనలు, భక్తజనుల హర్షధ్వానాల మధ్య రమణీయంగా రథయాత్రలు సాగాయి. రథ సప్తమి వేడుకలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. వేడుకల్లో మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు శ్రీనివాసరావు, వెంకటేష్‌జోషి, శ్రీపతి ఆచార్, ధార్మిక సహాయక అధికారులు బిందు మాధవస్వామి, వ్యాసరాజాచార్, ద్వారపాలక అనంతస్వామి తదితరులు పాల్గొన్నారు.





కర్నూలులో సూర్యనారాయణ స్వామికి పూజలు చేస్తున్న సచ్చిదానంద స్వామీజీ, ఆలయంలో భక్తులు

భక్తిశ్రద్ధలతో సూర్యారాధన

జిల్లాలో రథసప్తమి వేడుకలు శుక్రవారం వైభవంగా జరిగాయి. సూర్యనారాయణుడి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదిత్య హృదయం పఠనం చేసి సూర్యభగవానుడిని ఆరాధించారు. పలు ప్రాంతాల్లో సూర్య నమస్కారాలు చేశారు. సూర్య కిరణాలతో కలిగే ఆరోగ్య ప్రయోజనాలను యోగా గురువులు వివరించారు. మద్దికెర మండలం పెరవలి గ్రామంలో శ్రీరంగనాథుడు, శ్రీదేవి, భూదేవి అమ్మవార్ల కళ్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. కర్నూలులో నారాయణుడికి విశేష అభిషేకాలు చేశారు. –సాక్షినెట్‌వర్క్

కేఈ సొంతూరికి రోడ్డు వేస్తున్నాం

- టీడీపీ హయాంలో అభివృద్ధి శూన్యం
- మాయ మాటలతో మభ్యపుచ్చడమే వారి నైజం
- రోడ్డు, బ్రిడ్జి నిర్మాణాలకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



కంబాలపాడు- కోయిలకొండ గ్రామాల మధ్య బీటీ రహదారి, బ్రిడ్జి ఏర్పాటుకు శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని అవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, చిత్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

కృష్ణగిరి/తుగ్గలి: టీడీపీ హయాంలో డిప్యూటీ సీఎంగా ఉన్న కేఈ కృష్ణమూర్తి సొంత ఊరైన కంబాలపాడుకు కనీసం రోడ్డు వేసుకోలేకపోయారని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి విమర్శించారు. తాము కేఈ సొంతూరైన కంబాలపాడు నుంచి కోయిలకొండకు బీటీ రోడ్డు వేస్తున్నామన్నారు. శుక్రవారం కృష్ణగిరి, తుగ్గలి మండలాల్లో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు. కృష్ణగిరి మండలం టి.గోకులపాడు గ్రామ సమీపంలో హంద్రీపై నిర్మించనున్న బ్రిడ్జి, కోయిలకొండ-కంబాలపాడు గ్రామాల మధ్య బీటీ రహదారితోపాటు బ్రిడ్జి పనులకు శంకుస్థాపన చేశారు. కంబాలపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభించారు. తుగ్గలి మండలం బొందిమడుగుల-మారెళ్ల గ్రామాల మధ్య బీటీ రోడ్డు, బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 'వైఎస్సార్ రైతు భరోసా' నాల్గో విడత సాయాన్ని అందించేందుకు గతేడాది జూన్ 1న పత్తికొండ వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి నియోజకవర్గ సమస్యలు తీసుకెళ్లగా వెంటనే స్పందించారన్నారు. మాజీ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి స్వగ్రామమైన కంబాలపాడు నుంచి కోయిలకొండకు బీటీ రహదారితోపాటు బ్రిడ్జి నిర్మాణానికి రూ.3 కోట్లు మంజూరు చేయగా పనుల ప్రారంభానికి శ్రీకారం చుట్టామన్నారు. అలాగే టి.గోకులపాడు హంద్రీపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.7.95 కోట్లు, బొందిమడుగుల-మారెళ్ల గ్రామాల మధ్య బీటీ రోడ్డు, బ్రిడ్జి నిర్మాణానికి రూ.2.35 కోట్లు మంజూరు చేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధితోపాటు సంక్షేమానికి సమ ప్రాధాన్యం ఇస్తోందన్నారు. టీడీపీ హయాంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు 2014 ఎన్నికల సమయంలో 600 హామీలు ఇచ్చి అమలు చేయలేదని, ఇప్పుడు మాయ మాటలతో వస్తున్నారని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు కేఈ సుభాషిణి, పీఆర్, పీఐయూ డీఈలు శేషయ్య, రమేష్‌కుమార్‌రెడ్డి, ఏఈ వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యుడు సుంకన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు మునిరెడ్డి, ఈశ్వరరెడ్డి, రంగారెడ్డి, ప్రతాపరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, మాధవరావు, ప్రభాకర్‌రెడ్డి, తిమ్మరాజు, కృష్ణమూర్తి, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.



బొందిమడుగుల- మారెళ్ల బీటీ రోడ్డు నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

మహా కుంభాభిషేకానికి అంకురార్పణ



మహాకుంభాభిషేక మహోత్సవానికి పసుపు, కుంకుమ, ఫలపుష్పాదులు తీసుకెళ్తున్న మంత్రి దంపతులు, అధికారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలోసంప్రదాయబద్ధంగా మహాకుంభాభిషేక మహోత్సవానికి అంకురార్పణ జరిగింది. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో అర్చకులు, వేదపండితులు వేద మంత్రోచ్ఛరణలతో అధికారులు యాగశాల ప్రవేశం చేశారు. అనంతరం అర్చకులు లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ మహాకుంభాభిషేక సంకల్పం, గణపతిపూజ, రుత్విగ్వరణం నిర్వహించారు. ఈ మహిమాన్విత కార్యక్రమంలో విధివిధానముగా కలశాలను నెలకొల్పి, ఆయా కలశాలలో దేవతాశక్తిని నిక్షిప్తం చేసి జప, పారాయణ, ధ్యాన, హోమాదులను జరిపి, ఆ మంత్రపూరిత జలాలలో ఆలయంలోని గర్భాలయ విమానాలను, గోపురాలను, దేవతామూర్తులను అభిషేకంచడం జరుగుతుంది. మహాకుంభాభిషేక మహోత్సవాలకు రాష్ట్ర డిప్యూటీ సీఎం, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, శ్రీశైల జగద్గురు పీఠాధిపతి డా.చెన్నసిద్ధరామ శివాచార్య మహాస్వామి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.



అర్చకులకు వస్త్రాలు అందజేస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

కుక్కల దాడిలో గొర్రె పిల్లల మృతి


మృతి చెందిన గొర్రె పిల్లలు

అవుకు: వేములపాడు గ్రామంలో కుక్కల దాడిలో 60 గొర్రె పిల్లలు మృతి చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామ సమీపంలో గొర్రెల కాపరి చౌడం క్రిష్టుడు కంచెను ఏర్పాటు చేసి, అందులో గొర్రె పిల్లలను ఉంచారు. గొర్రెల కాపరి పనుల నిమిత్తం బయటికి వెళ్లగా కుక్కలు కంచెలోకి చొరబడ్డాయి. గొర్రె పిల్లలను గాయపరచడంతో దాదాపు 60 మృతి చెందాయి. సుమారు రూ.3 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు.

కరువు మండలాల్లో అదనంగా 50 రోజుల ఉపాధి

- మార్చి 3న పల్స్ పోలియో కార్యక్రమం


వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): కరువు మండలాల్లో అదనంగా 50 రోజుల ఉపాధి హామీ పని దినాలు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం ఆయన విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్పందన అంశాలపై కలెక్టర్లు, జేసీలు, ఇతర అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద 100 రోజుల పని దినాలను సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. కరువు మండలాల్లో అదనంగా 50రోజుల పనిదినాలను చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ జి.సృజన జిల్లాలోని కర్నూలు రూరల్, తుగ్గలి మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలని కోరారు. మార్చి 3న ఐదేళ్లలోపు చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వీసీలో కలెక్టరేట్ నుంచి డీఆర్వో కె.మధుసూధన్‌రావు, సీపీఓ హిమ ప్రభాకరరాజు, డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి, డీఎంహెచ్‌ఓ రామగిడ్డయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పది రోజుల్లో ఇద్దరికి కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు

- చరిత్ర సృష్టించిన కర్నూలు పెద్దాసుపత్రి వైద్యులు


కిడ్నీ మార్పిడి విజయవంతం కావడంతో వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ వెంకటరంగారెడ్డి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పదిరోజుల వ్యవధిలో ఇద్దరికి కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు నిర్వహించి వైద్యులు చరిత్ర సృష్టించారు. వివరాలను శుక్రవారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి వివరించారు. వివరాలు ఆయన మాటల్లోనే.. ''ఈరన్న(26) అనే యువకుడు ఆరేళ్లుగా కిడ్నీ సంబంధ వ్యాధితో బాధపడుతున్నాడు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో వారానికి రెండుసార్లు హీమోడయాలసిస్ చేయించుకుంటున్నాడు. ఇతనికి కిడ్నీ దానం చేయడానికి తల్లి సముఖంగా ఉండటంతో గత నెల 29న యురాలజిస్టు హెచ్‌వోడి డాక్టర్ సీతారామయ్య, డాక్టర్ ముత్యశ్రీ నేతృత్వంలో కిడ్నీ మార్పిడి ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించారు. ఈరన్న కోలుకోవడంతో ఈ నెల 6న డిశ్చార్జ్ చేశారు.

- ఎస్తేరిరాణి(44) నాలుగు సంవత్సరాలుగా మూత్రపిండాల వ్యాధితో బాధపడుతోంది. గత నెల 26న బ్రెయిన్ డెడ్ అయిన రోగి కుటుంబం అవయవదానానికి సిద్ధంగా ఉండటంతో యురాలజి హెచ్‌వోడి డాక్టర్ సీతారామయ్య, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ముత్యశ్రీ, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ రాజారెడ్డి, డాక్టర్ బాల రవితేజ, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ వెంకటమహేష్ నేతృత్వంలో కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించారు. శస్త్రచికిత్స అనంతరం ఎస్తేరి రాణి కోలుకోవడంతో డిశ్చార్జ్ చేశారు.''

'పది' పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- సమస్యాత్మక పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు
- ప్రతి పరీక్షా కేంద్రం దగ్గర 144 సెక్షన్ అమలు
- వివరాలు వెల్లడించిన డీఆర్‌ఓ మధుసూదన్‌రావు


సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో కె.మధుసూదన్‌రావు, చిత్రంలో డీఈఓ శ్యామూల్

కర్నూలు(సెంట్రల్): పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 18 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను డీఆర్వో కె.మధుసూదన్‌రావు ఆదేశించారు. జిల్లాలో 162 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని, 37,801 విద్యార్థులు హాజరుకానున్నట్లు చెప్పారు. సమస్యాత్మక పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని డీఆర్వో చాంబరులో పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణపై జిల్లా స్థాయి కమిటీ సమావేశమైంది. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రతి పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ విధించాలన్నారు. కాపీయింగ్, మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షలు జరిగే రోజుల్లో కేంద్రాలకు సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూయించాలన్నారు. విద్యార్థులకు పరీక్షలు రాయడానికి అనువైన సమయంలో ఆర్టీసీ బస్సులను నడిపేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మార్చి 18 నుంచి 27వ తేదీ వరకు ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఓపెన్ టెన్త్ పరీక్షల కోసం 12, ఇంటర్ పరీక్షల కోసం 9 సెంటర్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మార్చి 30 నుంచి ఏప్రిల్3వ తేదీ వరకు ఓపెన్ ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. డీఈఓ శామ్యూల్ మాట్లాడుతూ 162 పరీక్ష కేంద్రాలకు 162 చీఫ్ సూపరింటెండెంట్లు, 162 మంది డిపార్టుమెంట్ అధికారులను నియమించినట్లు చెప్పారు. పరీక్షల పర్యవేక్షణకోసం 7 ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

మోదీ పాలనకు చరమగీతం పాడుదాం

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఏ గఫూర్


కలెక్టరేట్ ఎదుట జరిగిన నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఏ గఫూర్

కర్నూలు(సెంట్రల్): ప్రధానమంత్రి నరేంద్రమోదీ నిరంకుశ పాలనకు చరమగీతం పాడుదామని కర్నూలు మాజీ శాసనసభ సభ్యుడు, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఏ గఫూర్ పిలుపునిచ్చారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా శుక్రవారం కార్మిక, రైతు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కర్నూలులోని జిల్లా పరిషత్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గఫూర్ మాట్లాడుతూ.. నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చాక రైతులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్మిక చట్టాలను మార్చి కార్మికులను బానిసలుగా మార్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. వ్యవసాయ రంగంలో తెచ్చిన నల్ల చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటం ఫలితంగా ఆ రోజు కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చి రైతులకు ఎన్నో హామీలను ఇచ్చిందన్నారు. అయితే ఇంత వరకు వాటిని అమలు చేయడానికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. రైతు శ్రమకు తగ్గట్టుగా పెట్టుబడికి అదనంగా 50 శాతం కలిపి మద్దతు ధర చట్టం తేవాలన్నారు. వ్యవసాయ కార్మికులకు కనీసం 200 రోజులు పని దినాలను కల్పించి రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు, నాయకులు కేవీ నారాయణ, శ్రీనివాసరావు, సురేష్, పోతుల సురేష్, నాగన్న, నరసింహులు, భాస్కర్, చంద్రశేఖర్, అరులప్ప తదితరులు పాల్గొన్నారు.

పట్టుబడిన వాహనాలకు వేలం

- సెబ్ డీఎస్పీ వినోద్‌కుమార్


వేలంపాటల్లో పాల్గొన్న వారికి సూచనలు చేస్తున్న సెబ్ డీఎస్పీ వినోద్‌కుమార్

ఆదోనిరూరల్: నాటుసారా, కర్ణాటక మద్యం తరలిస్తూ పట్టుబడిన వాహనాలకు సెబ్ డీఎస్పీ వినోద్‌కుమార్ నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం వేలం పాటలు నిర్వహించారు. స్థానిక సెబ్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన ఈ వేలం పాటల్లో మూడు ఆటోలు, ఒక కారు, 42 టూవీలర్స్‌ను పాటదారులు దక్కించుకున్నారు. మొత్తం ప్రభుత్వం ధర రూ.2,65,000 ఉండగా పాటదారుల నుంచి రూ.5,95,800 ఆదాయం వచ్చిందని డీఎస్‌ఈఎ తెలిపారు. వేలం పాటలో సెబ్ సీఐలు భార్గవరెడ్డి, విన్నీలత, సిబ్బంది పాల్గొన్నారు.

కృత్రిమ మేధస్సుపై ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు శిక్షణ

కర్నూలు సిటీ: ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్‌ఫర్‌మేషన్ టెక్నాలజీ డిజైన్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్(ట్రిపుల్‌ఐటీడీఎం)కి చెందిన విద్యార్థులకు కృత్రిమ మేధస్సు(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్), రియల్ టైం అప్లికేషన్స్‌పై శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి గూగుల్‌లో ఇంజినీరింగ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న జి.గౌతమ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గూగుల్‌లో ప్రకటనల భద్రతకు కృత్రిమ మేధస్సు ఏ విధంగా వినియోగించాలో స్పష్టంగా వివరించారు. అదే విధంగా కృత్రిమ మేధస్సు, మెషీన్ లెర్నింగ్‌లో ప్రస్తుతం జరుగుతున్న పరిశోధనల గురించి అవగాహన కల్పించారు. కంప్యూటర్ సైన్స్ విభాగంలో మంచి భవిష్యత్తును నిర్మించుకునేందుకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. అనంతరం జి.గౌతంను ట్రిపుల్ ఐటీ డీఎం డీపీఎల్ ఎన్ సోమయాజులు, సిబ్బంది సన్మానించారు.

మల్లన్నసేవలో శ్రీశైల జగద్గురు పీఠాధిపతి

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లను శ్రీశైల జగద్గురు పీఠాధిపతి డాక్టర్ చెన్నసిద్దరామ శివాచార్య మహాస్వామి దర్శించుకున్నారు. పీఠాధిపతికి ఆలయ రాజగోపురం వద్ద ఈఓ డి.పెద్దిరాజు, అర్చకులు, వేదపండితులు స్వాగతం పలికారు. అనంతరం మల్లికార్జున స్వామివారిని, భ్రమరాంబాదేవిని పీఠాధిపతి దర్శించుకున్నారు. అమ్మవారి ఆలయం వద్దగల ఆశీర్వచన మండపంలో పీఠాధిపతిని దేవస్థాన అధికారులు వస్త్ర, ఫల సమర్పణలతో సత్కరించారు.

భారీగా కర్ణాటక మద్యం పట్టివేత


పట్టుబడిన కర్ణాటక మద్యాన్ని చూపుతున్న సెబ్ పోలీసులు

కోడుమూరు: కర్ణాటక రాష్ట్రానికి చెందిన 960 టెట్రా ప్యాకెట్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ రామాంజనేయులు తెలిపారు. సి.బెళగల్ మండలంలోని బురాన్‌దొడ్డి గ్రామం వద్ద మోటార్ సైకిల్‌పై కర్ణాటక మద్యం తరలిస్తున్న పెద్దనేలటూరు గ్రామానికి చెందిన రామచంద్రను అదుపులోకి తీసుకున్నామన్నారు. అలాగే అల్వాల గ్రామానికి చెందిన బడేషావలి కూడా అదుపులోకి తీసుకున్నామన్నారు. ఇద్దరు వ్యక్తుల వద్ద నుంచి 960మంది టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, రెండు మోటార్‌సైకిళ్లను సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. దాడుల్లో సెబ్ ఎస్ఐ అలీబేగ్, సిబ్బంది హనుమంతు, శంకర్‌నాయక్, విరూపాక్షిరెడ్డి, వెంకటేష్, అఫ్రోజ్, అన్సార్ తదితరులు పాల్గొన్నారు.